

ఆక్షణం

ఎమ్. హేమలత

తెరమీద మధ్యవయస్సు హీరోయిన్ తన కూతురు ధరించవలసిన లంగా, ఓణీలతో ఎగురుతూంది - షట్టలు, గుట్టలు పట్టుకొని.

లావుపాటి బొజ్జని అతి కష్టంగా బుష్‌షర్ట్‌లో దాచేసి ఆయాసపడుతూ, పరుగెత్తుతున్నాడు అలనాటి హీరో.

ఆనంద పెదవులమీద అప్రయత్నంగా చిరునవ్వు వెలిసింది. పాపం! హీరోకి హార్ట్‌అటాక్ రాదుకదా యీ పరుగు పందెంలో...!

హీరోయిన్‌ని దొరకపుచ్చుకున్నాడు హీరో. ఇద్దరూ పొదలమాటుకి అదృశ్యమయ్యారు, సెన్సార్ కత్తెరకి అందకుండా!

ఆనంద కళ్ళు సినిమా చూస్తున్నవే కాని, మనస్సు మాత్రం మన్మధని గురించే ఆలోచిస్తూంది. ఈరోజు సినిమాహాల్లో ఇంతలా కబుర్లు చెబుతూ, నవ్విస్తూ, కవ్విస్తూ కూచున్న ఈ మన్మధ నిన్న తనతో ఎంత ఘర్షణ పడ్డాడు! ఎంత భయపడ్డది తాను! కొండలా వచ్చిన ఆపద, దూదిలా ఎగిరిపోతుందంటారు దీన్నే కాబోలు. నిన్నటికి నిన్న...

* * *

“ఏమండీ! ఇలా తలపట్టుకు కూచుంటే ఎలాగండి?” ఆనంద మాటలు, ఆనంద నోట్లో వుండగనే ‘గంయి’ మని లేచాడు మన్మధ.

“అంటే నీ వుద్దేశం, నేనేం పట్టించుకోవటంలేదనే కదూ! సంసారం అంటే లక్ష్యం లేని చవట దద్దమ్మననే కదూ!”

"అబ్బబ్బ ! ఎందుకండీ అంతంత మాటలు ! మన మిద్దరమే అయితే ఫరవాలేదు మనిద్దరికి ముగ్గురున్నారే ! ఎంతకాల మిలా...?"

"అందుకే నేను నా వుద్యోగం ఊడిననాడే చెప్పాను – పిల్లల్ని తీసుకొని పుట్టింటికి వెళ్ళమని. నా కెలాగూ నా అన్నవాళ్ళు లేరు, కనీసం నువ్వయినా."

"భలేవారండి మీరు...? వుద్యోగం లేక మనస్తాపంలోవున్న మిమ్మల్ని విడిచి టింగురంగా అంటూ నేను మాత్రం వూరెళ్ళి కూచోనా...?"

"ఈ మాట ఇప్పటికి వందసార్లు చెప్పావు. అందుకే నాతోబాటు నువ్వూ..."

"నే నెప్పటికైనా, దేనికైనా తయారేనండీ ! కానీ...పిల్లలు...? ఈ నెల జీతాలు కట్టక స్కూలుకి కూడ పంపలేదు కదా వాళ్ళని...!"

"ఓహ్ ! వాళ్ళేమీ...ఐ.ఎ.ఎస్. లు డాక్టరీలు వెలిగించక్కరలేదులే !"

"చూడండి ! ఎన్నాళ్ళిలా ఇంట్లో వస్తువులు అమ్మి తింటూ కూచుంటాం ? ఇదో, అదో అని అప్పుడే నాలుగు నెల లవుతూంది...!"

"నందా ! నన్నేం చేయమంటావో చెప్పు ? నేనూ ఉద్యోగ ప్రయత్నం లోనే వున్నాను కదా ! ఇంక అదీ, ఇదీ కాకుంటే దొంగతనానికి బయలుదేరాలి!"

"రామరామ ! ఏ మాటన్నా మీతో కష్టమే వచ్చిపడింది అయినా బంగారం లాంటి వుద్యోగాన్ని వొదులుకొని..."

"అదిగో! మళ్ళీ మొదలెట్టావ్! వుద్యోగం బంగారమో, వెండో నాకు తెలీదనుకున్నావా ? ఆ వెధవ చేసే దగుల్బాజీ పనులన్నింటికి తలూపుతూ, అతగాడు చేసే అక్రమాల నన్నింటిని కప్పిపుచ్చుతూ, పైగా నేను పై అధికారులతో అబద్ధపు సాక్ష్యం పలకాలా? అలా పలకనన్నానని నామీద లేనిపోని నిందారోపణలు చేసి వుద్యోగం ఊడదీయిస్తాడా ? నా నిజాయతీ బయటపడి,మళ్ళీ వుద్యోగం రాకుండా పోతుందా...?"

"చూడండి. మీ మట్టుకు మీరు న్యాయంగా వున్నారు. ఒకరి సొమ్ము అక్రమంగా తినడంలేదు. నిజమే - కష్టపడి కడుపు నింపుకుంటున్నారు. అంతవరకు చాలండి మీ నిజాయితీ ! ఒకరితో మీ కేం పని ?"

"ఇలా ప్రతి ఒక్క చవట అనుకొనే మన దేశ మిలా తగలబడిపోతున్నది నందా ! నీ కెందుకు ... నీ వేం దిగులు పడకు ! నిన్ను కట్టుకున్నందుకు పిల్లల్ని - కన్నందుకు మిమ్మల్ని పోషించే భారం నాది..." చిరాగ్గా, మరింత కోపంగా మన్మథ లేచి పచార్లుచేయడం మొదలెట్టాడు.

"నేను చెప్పేది...ప్లీజ్ ... కాస్త

వినండి. ఇందాక మీరు అలా బయటకు వెళ్ళినప్పుడు రామస్వామి..."

"ఎవరు? ఆ గుంటనక్క రామస్వామే! వెధవ ! వాడెందు కొచ్చాడు మళ్ళా? నువ్వెందుకు రానిచ్చావ్ వాడిని ?"

"అబ్బబ్బ ! మీ రావేశపడక నేను చెప్పేది కాస్త వినండి. మీ కంపెనీ జి.ఎమ్. పంపిస్తే వచ్చాట్ట!"

"ఊ..."

"ఆ ఫైల్లోని ఆ కాగితాలని తొలగించి వేసి, అతడు చెప్పినట్లు చేస్తే మిమ్మల్ని వేరే వూరికి ట్రాన్స్‌ఫర్ చేయించి, అక్కడి బ్రాంచికి మేనేజర్‌ని చేసే పూచీ తనదంటూ చెప్పాట్ట..."

"స్కౌండ్రల్ ! ఇడియట్ ! ఆ రామస్వామి గాడివన్నీ ఏకరువు పెట్టూ కూచుంటే, సావకాశంగ విన్నావన్న మాట. నీ కెంత బుద్ధిలేదు నందా !"

మన్మథ కోపావేశంతో అన్న మాటలకి కొంత జడిసింది ఆనంద. కానీ, వెనువెంటనే ధైర్యం తెచ్చుకుంది.

"ఔనండీ ! అతడు చెప్పేది కరెక్టే! ఈ ఊర్లో ఉండొద్దు మనం. వేరేచోట కెళ్ళి నిజాయతీగా బ్రతుకుదాం. మీ జి.ఎమ్. అడిగే కాగితాలను అతగాడికి యిచ్చిపడేస్తే మనకేం పోతుందండీ ?"

"అయ్యో ! పిచ్చి ఆనందా నీ కేం మతిపోయిందా ? ఆ కాగితాల్లోనే వుంది, అతని జాతకమంతా ! సంసారం కాపాడుకోడానికే అతనికి దాసోహం అనడంకన్నా, నా భార్యా పిల్లల కింత విషమిచ్చి నేనూ, నాతోపాటూ..."

"పోనీ ఆ పనయినా చేసి పుణ్యం కట్టుకొనండి. చావాలేక బ్రతకనూ లేక, రోజు రోజు చావటంకన్నా..." దుఃఖం ముంచుకొచ్చింది, ఆనందకి.

* * *

ముభావంగా కాఫీ త్రాగి బయటి కెళ్ళిన మన్మథ, హుషారుగా ఈల వేసుకుంటూ వచ్చాడు, పన్నెండుగంటల ప్రాంతంలో. చేతినిండా బట్టల ప్యాకెట్లు, పూలు, పండ్లు, మిటాయి పొట్లాలు. దిగ్భ్రమ చెందిన ఆనంద, అనుమానంగా చూచింది భర్తకేసి. మన్మథ చిరునవ్వు నవ్వాడు. పిల్లలు కొత్తబట్టల సంబరంలో పడిపోయారు. భర్తని చేరిన ఆనంద, ప్రశ్నార్థకంగా చూసింది

"భయంలేదోయ్ ! నేనేం దొంగతనం చేయలేదు... !"

దెబ్బతిన్నట్లు చూసింది, ఆనంద.

"పిచ్చిమొద్దూ ! ఆశ్చర్యపోతున్నావెందుకోయ్ ? భార్యా పిల్లలకు అన్నం పెట్టలేని నా నిజాయితీ ఎందుకు నన్ను కాల్చనా ! రాత్రంతా ఆలోచించాను. నువ్వు చెప్పిందే సబబనిపించింది. ప్రొద్దుటే వెళ్ళి ఆ ఫైలులోని ఆ కాగితాలను జి.ఎమ్. ముఖాన పడేశాను. జి.ఎమ్. నన్ను మెచ్చుకున్నాడు. నా సిన్సియారిటీకీ జోహారు లన్నాడు. ఇవ్వవలసిన నాలుగు నెలల జీతం ఇచ్చి,

రేపటినుండే డ్యూటీలో జాయిన్ కమ్మంటూ ఆర్డర్సూ, షేక్‌హాండ్ ఇచ్చి మరీ పంపాడు. ఇప్పుడు చెప్పు ! నందా ! నేను ప్రయోజకుణ్ణే కదూ !" ఆనంద చుట్టూ చేతులేసి, ముఖంలో ముఖం పెట్టి, అడిగాడు మన్మధ.

భర్త ముఖంలోకి సూటిగా చూడలేక, తప్పుచేసినదానిలా తల దించుకుంది, ఆనంద.

"చెప్పు నందా ! నీ కిపుడు సంతోషంగా వుంది కదూ !" ఆనంద వీపుమీద ముఖం రుద్దుతూ అన్నాడు, మన్మధ.

మరేం మాట్లాడలేని ఆనంద తన కంటనీటితో భర్త షర్టుని తడిపింది.

"నందా ! ఊర్కో. మన కష్టాలన్నీ గట్టెక్కాయి. ఇప్పు డీ కన్నీ రెందుకు? పద. మన నూత్న జీవితాన్ని స్వీట్స్‌తో సెలబ్రేట్ చేద్దాం." పిల్లల వద్దకు ఆనందని నడిపించాడు, మన్మధ.

కొత్త బట్టలని, మిటాయిని, పండ్లని పంచేసుకొని, పువ్వులని, కొత్తచీరని అమ్మకి అందించారు పిల్లలు పరమానందంగా.

* * *

హాల్లో ఇంటర్వెల్‌ని వుద్దేశిస్తూ, గోల్డ్‌స్పాట్ - స్నాక్స్ కన్పించసాగాయ్.

తనకి పరిచయమున్న ముఖాలేమైనా కన్పిస్తాయేమోనని అటూ - ఇటూ చూస్తున్న ఆనంద వద్దకు వచ్చాడు, రామస్వామి.

"ఓ... మీరు కూడా వచ్చారే ! మీ మిసెస్ రాలేదా...?" అంది, చిరునవ్వు నవ్వుతూ ఆనంద.

"రాలేదమ్మా ! ఆవిడకి ఇటువంటి సినిమాలు నచ్చవ్. ఏవో పాతకాలపువి మార్నింగ్ షోస్‌కి మాత్రమే వెళ్తూంటుంది. అన్నట్లు మన్మధగారు రాలేదా ? పిల్లలేరీ...?" అన్నాడు రామస్వామి.

"అందరం కలిసే వచ్చామండీ. మావా రిప్పుడే అలా పిల్లల్ని తీసుకొని బయటకు వెళ్ళారు."

"అలాగా...!" అంటూ రామస్వామి ఒక్క నిమిషం ఆగి, సందేహిస్తూనే, ఆనందగారూ ! నే నంతగా చెప్పి కూడ మీరు మీవార్ని వొప్పించలేకపోయారు కదండీ ! జి.ఎమ్. అగ్గిమీద గుగ్గిలమై పోతున్నాడు. వీలయితే మన్మధగార్ని క్రిమినల్ కేసులో కూడా ఇరికించాలని చూస్తున్నాడు. కొండని తలతో ఢీ కొనడం ఎందుకు చెప్పండి ?" మన్మధ దూరంగా రావటం గమనించిన రామస్వామి, మెల్లగా జారుకున్నాడు.

దిగ్భ్రాంతికి లోనయిన ఆనంద, కొంతసేపు తేరుకోలేకపోయింది. ఇంతలో భర్త - పిల్లలు రావటం, భర్త తనచేతిలో చిప్స్ ప్యాకెట్ పెట్టడం, వెంటనే సినిమా ప్రారంభం కావడం,

ఇవన్నీ క్షణంలో జరిగిపోయాయ్. సినిమాలో లీనమైపోయ్యారందరూ – ఒక్క ఆనంద తప్ప. ఆనంద మస్తిష్కంలో అనంత కోటి అనుమానాలు !

భర్త మాటలకి, రామస్వామి మాటలకి ఎక్కడా పొంతన కుదరడం లేదు. ఎవ్వరి మాట నమ్మాలి? ఎవ్వరిమాట తోసిరాజనాలి...?

భర్తకేసి తదేకంగా చూడసాగింది ఆనంద, ఎవరో కొత్తమనిషిని చూచినట్లు ఎంతో ఆనందంగ, మరెంతో ఆహ్లాదంగ వున్న తన భర్త తనకి అబద్ధం చెప్పవలసిన అగత్యమేమిటి? కానీ, రామస్వామి కేం పట్టింది, అసత్య మాడడానికి...? తెరమీద గ్రూప్ ఫోటో పడడంతో తన ఆలోచనలకి స్వస్తి చెప్పింది, ఆనంద.

సినిమానుండి ఇంటికి వచ్చిన మన్మధ హుషారుగ పిల్లలకి అన్నం పెట్టడంలో భార్యకి సాయపడ్డాడు. పిల్లలకి సినిమా చూడకముందున్న హుషారు, సినిమా చూచి వచ్చాక లేదు; అన్నాలు తినీ-తినక మంచాలకి అడ్డం పడ్డారు.

పిల్లల భోజనాలయ్యాక, భార్యా భర్త లిద్దరూ కూచున్నారు భోజనానికి

"ఒక కంచం చాల్లేవోయ్ !" రెండో కంచాన్ని దూరంగా తోస్తూ అన్నాడు మన్మధ

తలెత్తి చూచిన ఆనందకి చిలిపి నవ్వులు చిందిస్తున్న భర్త కన్పించాడు.

మన్మథ నడిపించే ఆ రసవత్తర నాటకంలో తాను కూడ పాల్గొనదలచింది ఆనంద.

"మీ ఇష్టం," అంటూ ఒకే కంచంలో వడ్డించింది.

"నందా! ఇలా మనిద్దరం ఒకే కంచంలో తిని ఎన్నాళ్ళైందో కదూ!" మన్మథ అందిస్తున్న అన్నం ముద్దని చేతిలోకి తీసుకొని మనోహరంగా నవ్వింది, ఆనంద.

తనో ముద్దచేసి, భర్తచేతి కందించింది, ఆనంద.

"అబ్బ! ఎంత రుచిగా వుందీ పూట నీ వంట!" అంటూ, మన్మథ ఆనందని కవ్విస్తూ భోజనం పూర్తి చేశాడు.

ఆనంద వంటిల్లు సర్ది, పడుకునే గది లోకి నడిచింది. లోనికి వెళ్ళిన ఆనంద ఓ క్షణం నివ్వెరపోయి నిలబడిపోయింది. పక్కమీద తెల్లటిదుప్పటి పరిచివుంది. వాటిమీద మల్లెలు విరిసి సువాసనలు వెదజల్లుతున్నాయ్. మల్లెల సువాసనకు తోడు సుగంధ శృంగార పరిమళాలు. ఆశ్చర్యచకితయై గదిని పరికిస్తున్న ఆనందకేసి, ఆనందంగా చూశాడు మన్మథ.

"రా, నందా! అలా నుంచున్నావేం? పదేళ్ళనాటి మన తొలిరేయి గుర్తొచ్చిందా? అప్పటిలాగే - ఇప్పుడూ మంచందగ్గరికి నడిపించాలా?" మన్మథ మాటలికి నవ్వొచ్చింది ఆనందకి. అయోమయంగానే భర్త చెంతకి నడిచింది ఆనంద.

దరిచేరిన అర్ధాంగిని అత్యంత తమకంతో హృదయానికి చేర్చుకున్నాడు మన్మథ. ఊపిరి సలపలేనంత వుద్వేగంతో వూగించాడు. భర్త ఉధృత ప్రణయంలో కొట్టుకపోయిన ఆనంద మనస్సు - శరీరం, ఆనందంతో మూగవోయాయి...

ఆదమరచి నిద్రపోతున్న భర్తకేసి చూస్తూ అలాగే పడుకుంది ఆనంద. భర్త ప్రవర్తనని, పల్కులని, చేష్టలని అర్థం చేసుకోలేక ఇదమిద్ధమని సమన్వయపరచుకోలేక, ఆనంద బుర్ర పగిలిపోసాగింది. ఎంత ప్రయత్నించినా నిద్రపట్టడంలేదు ఆనందకు. కళ్ళు మూసుకొని పడుకున్న ఆనంద నిద్రాదేవి ఒడిలోనికి జారుకునేటప్పటికి, తన ఒడిలోని తన మన్మథ, మంచంమీది నుంచి జారుకున్నాడు.

ఏదో శబ్దానికి వులిక్కిపడి ప్రక్కకి తిరిగి చూచింది, ఆనంద. తన ప్రక్కన భర్త లేడు. గబుక్కున లేవబోయిన ఆనంద, గదిలో ఒకమూలవంగి, సూట్ కేస్ లోంచి ఏదో బయటకు తీస్తున్న భర్తను చూచి ఆగిపోయింది. భర్త దృష్టిలో పడకుండా, అలాగే పడుకొని, భర్త చేష్టలని గమనించసాగింది.

సూట్ కేస్‌లోంచి అట్టపెట్టె నొకదాన్ని బయటకు తీసాడు మన్మథ. అందులోంచి

ఇంజెక్షన్‌ని సిరంజిని తీసి టేబిల్ పై పెట్టి మంచంకేసి చూశాడు. వెంటనే కళ్ళుమూసుకొని నిద్రనభినయించ సాగింది ఆనంద.

సిరంజితో కి మందును ఎక్కించి మళ్ళీ భార్యకేసి చూశాడు మన్మథ. పాపం ఆదమరిచి నిదురోతోంది, ఆనంద అనుకున్నాడు. లేచి, పిల్లలున్న గదికేసి నడువబోయాడు. మళ్ళీ ఏమనుకున్నాడో ఏమో ఆ ప్రయత్నం విరమించాడు. ఓ మారు సిరంజికేసి చూచి మెల్లగా ఆనంద పడుకున్న మంచంవేపు నడిచాడు.

ఉలిక్కిపడింది ఆనంద మన్మథని చూచి. ఇదేంటి? ఈయన ముఖం ఇంత వికృతంగా వుంది? ముఖంనిండా ఆ చెమటేంటి? ఎందు కలా వణికి పోతున్నాడు! చూద్దాం! ఏమవుతుందో! అని మళ్ళీ నిద్ర నభినయించింది, ఆనంద.

ఆనంద ముఖంకేసి దీర్ఘంగా చూచి, గబుక్కున వంగి ఆమెచేయి అందుకున్నాడు మన్మథ.

భర్త చెయ్యి తనమీద పడగానే చివ్వున లేచి కూచుంది ఆనంద. అదిరి పోయాడు మన్మథ. ఒక్కడుగు వెనక్కి వేశాడు.

"ఏమిటి మీరు చేస్తున్న పని...!?" ప్రశ్నించింది ఆనంద. జవాబు చెప్ప టానికి తటపటాయించాడు మన్మధ.

"చెప్పండి ! ఎందుకిస్తున్నారు, నాకీ ఇంజక్షన్ ? నాకేం జబ్బుచేయలేదే !"

ఈమారూ సమాధానం చెప్పలేదు మన్మధ. అతనిచేయి మాత్రం వణక సాగింది.

"ఏమండీ ! నా ముఖం చూచి నిజం చెప్పండి. ఆ సిరంజిలో వున్నది విషం కదూ !"

పట్టుబడిపోయినట్లు తల వంచు కున్నాడు మన్మధ.

"మీ రెంతపనికి సిద్ధపడ్డారండి ! కట్టుకున్న భార్యకే విషమిచ్చి చంపాలన్న సత్సంకల్పం ! పోనీ, అదీ మంచిదే ! భర్తచేతుల్లో మరణించడం కన్న భార్యకి కావలసినదేమున్నది ? కానీ, నన్ను చంపి మీరు పొందగోరే లాభమేమిటి ? నా పేర ఇన్సూరెన్స్ లేదే ! నా పేర ఏ ఆస్తిపాస్తులు లేవే!!"

"నందా ! నందా !!" గట్టిగా అరిచాడు మన్మధ

"ప్లీజ్, చెప్పండి! నేను చనిపోవడమే మీ కోరికయితే, ఇదో ఇప్పుడే ఇంజక్షన్ చేసుకొని సంతోషంగా చచ్చిపోతాను. కాని, మీరు పిల్లలు సుఖంగా బ్రతుకుతామని మాత్రం మాట యివ్వండి" చెయ్యి చాపుతూ, దృఢ నిశ్చయంతో అంది ఆనంద.

"నందా ! ఆనందా !! నన్నెంత అపార్థం చేసుకుంటున్నావ్ ? నువ్వు చనిపోయాక నేను, పిల్లలు బ్రతికుంటా మనే నీ వుద్దేశ్యమా ? నీతోపాటే మేమూ...!"

"అంటే అందరికీ ఇలాగే విషపు ఇంజక్షన్లు ఇచ్చి చంపేస్తారన్నమాట !"

దానికేం సమాధానంలేనట్లు చూశాడు, మన్మధ.

"ఎంత పనికి ఒడిగట్టారండీ ? కుటుంబాన్ని పోషించలేక ఈ నిర్మూలన పద్ధతికి దిగజారారన్నమాట ! హుఁ ఇటువంటి అఘాయిత్యానికి తలబడతా రని రాత్రి సినిమాహాల్లోనే ఊహించ వలసింది కాని, అంత దూరం ఆలోచించలేకపోయాను."

"హూ...ఁ అప్పు తెచ్చి...! అలా ఎన్నాళ్ళు ? ఒకని దగ్గర తలవంచి, దేహీ ! అని చేయిచాపడంకన్న, ఒక్కసారి అందరం చనిపోవటమే మేలనే యీ నిశ్చయానికి వచ్చాను. నాకు బి.ఎ లో వచ్చిన బంగారు పతకాన్ని తెగనమ్మాను. పిల్లలకు పిడికెడు అన్నం పెట్టలేని ఆ గోల్డ్ మెడల్, కనీసం ప్రశాంతంగా కనుమూయటానికైనా ఉపయోగపడితే మేలనుకున్నాను ఆనందంగా నిద్రపోయిన నా పిల్లలు ఆనందంగానే మరణిస్తారు. నందా ! ప్లీజ్ ! నిన్ను వేడుకుంటాను. నాతో సహకరించు, నా మనస్సాక్షిని చంపు

కాని నేనో క్షణమైనా బ్రతకలేను. నన్ను నమ్ముకున్న మిమ్మల్ని, నడివీధిలో అనాధులుగ వదలలేను. అందుకే నాతోబాటు మీరూ !"

ఎవరో కొత్తమనిషిని చూచినట్లు చూసింది, ఆనంద.

"అంటే మన మందరం చనిపోవడమే దీనికి పరిష్కారమా ?"

"అంతకన్న ఇంక వేరే మార్గంలేదు. నేను లేక నువ్వు లేవు. మనిద్దరంలేక పిల్లలు లేరు. పద పిల్లలకి ఇంజక్షన్ యిచ్చి ఆ పిమ్మట మనిద్దరం ఒకే మారు ఇంజక్షన్ చేసికొని ఒకరిచేతుల్లో ఒకరం..."

మన్మధ చేతుల్ని విదిలించి లేచి నుంచుంది, ఆనంద.

ఆనంద ముఖంలో అంతులేని గంభీరత.

ఇంత చదువులు చదివి, ఎంతో జ్ఞానం, అనుభవం సంపాదించిన మీరు కేవలం బ్రతుకుతో పోరాడలేక పిరికి పందలాగ పారిపోవడమా...?"

"నువ్వెలాగయినా భావించుకో ! నా కనవసరం. నా తుది నిశ్చయం, నిర్ణయం మారదు."

"అంటే ! మీరు చనిపొమ్మనగానే మేము మీ ఆజ్ఞను శిరసావహించాలా ?"

దెబ్బతిన్నట్టు చూశాడు, మన్మధ ఆనందకేసి —

అదే నిశ్చల గంభీరత! ప్రళయానికి ముందు కనిపించే ప్రశాంతత !!

"ఓహో ! మిమ్మల్ని చంపే అధికారం నాకు లేదన్నమాట. నీమీద లేదేమోకాని, నేను జన్మనిచ్చిన నా పిల్లలమీద నాకున్నది అధికారం !" ఒకవిధమైన ఉన్మాదం చోటు చేసుకున్నది మన్మధలో.

విరక్తిగా నవ్వింది, నందా! మళ్ళీ మళ్ళీ నవ్వింది !

"మీరు జన్మ నిచ్చిన మీ పిల్లలు ! బాగుంది ! ఫలానా రోజున ఫలాన బుల్లి బాబును కంటున్నాను — అన్న దృఢ నిశ్చయంతో కన్నారా ? కేవలం మీ ఆనందసమయంలో మీ ప్రమేయం లేకుండా ఆవిర్భవించిన జీవులండీ అవి."

ఆనంద మాటలకి మరొక్కమారు అదిరిపోయాడు, మన్మధ. వెనువెంటనే చెప్పలేనంత కోపం ముంచుకొచ్చింది.

"ఈ వితండ వాదాలు నా కనవసరం. నేను చెయ్యదల్చుకుంది తప్పక చేసి తీరుతాను."

గబగబ పిల్లలున్న గదిలోకి నడిచాడు, మన్మధ.

సుడిగాలిలా ముందుకు సాగిన ఆనంద, పిల్లలకి భర్తకి మధ్య నిలబడ్డది. ఆవేశంతో వూగిపోతూ, విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయిన భర్త కాళ్ళపై పడిపోయింది. పండుటాకులా వణికి పోతూ, బావురుమంది.

"ఏమండీ! ఒక్కమారు, ఒకే ఒక్క మారు, ఆ పసికందులకేసి కన్నెత్తి చూడండి. వాళ్ళేం పాపం చేశారని

వాళ్ళ చిరులేత జీవితాలిలా అర్థాంతరంగ అంతరించాలి? కవిత, గీతలు ఇద్దరూ నా రెండు కళ్ళు - అని వాళ్ళని నెత్తిమీద కెక్కించుకునేవారే ! మీరేనా వాళ్ళ కళ్ళని శాశ్వతంగా మూసివేసేది!! ఆదమరచి నిదురోతున్న ఈ కసికందులకు విషం ఎలా ఇవ్వగలరండీ....? మీరు నిజంగా మనుషులేనా...? మీది నిజంగా హృదయమేనా...?" భార్య బరువైన మాటలు వింటూ చేష్టలుడిగి నిలబడ్డాడు, మన్మధ.

భర్త మౌనాన్ని ఆసరాగా చేసికొని, ఆనంద గబగబ లేచి పిల్లల్ని నిద్ర లేపింది. సగం నిద్రలో లేచి, లేవక మత్తు మత్తుగ తల్లిదండ్రులకేసి చూడ సాగారు, పిల్లలు.

"ఆనందా ! ఎంత పనిచేశావు ? కన్నబిడ్డల ఎదుట దోషిగా నిలబెడ్తావా నన్ను...?" గిరుక్కున వెనుతిరిగి గదిలోకి వెళ్ళిపోయాడు మన్మధ. అతని వెనువెంటనే పరుగెత్తిన ఆనంద, మన్మధ గది తలుపులను బంధించనీయ కుండ అడ్డుపడింది.

"వదులు, ఆనందా ! నిన్నుకాని, పిల్లల్నికాని నేను చంపను. చంపలేను. ఆ హక్కు నాకు లేదని నువ్వేగా నిరూపించావ్. అసమర్ధుడనైన నేను ఈ ప్రపంచంలో బ్రతకను. బ్రతకలేను. బ్రతకకూడదు..." రోషావేశం ముప్పిరి గొంటున్న భర్తచేతిలోని సిరంజిని బలవంతంగా లాగి నేలకేసి కొట్టింది, ఆనంద.

ఆదిశక్తివలె నిలబడిన ఆనందకేసి, బ్రద్ధలయిన సిరంజికేసి చూడసాగాడు మన్మధ.

ఆవేశం దిగిపోయిన మన్మధ మంచం మీద జారగిలబడి రోదించసాగాడు. భర్తని అనురాగంతో తన ఒడిలోకి తీసుకుంది ఆనంద. తల్లిలా తన ఎదపై భర్తతలని చేర్చుకుంది.

"మీరు జీవన్మృత్యులు కారండీ ! మృత్యుంజయులు కావాలి. భగవంతుడు మన కిచ్చిన అమూల్యమైన వరాలండీ మన ఈ జీవితాలు. వీటిని అర్థాంతరంగ అంతరింపజేసే అమానుష కృత్యాలను మనం చేయకూడదండీ ! కష్టాలు వచ్చినప్పుడే వాటికి ఎదురొడ్డి నిలబడాలి. చనిపోవటమే కష్టాలకి పరిష్కారమైతే రోజు కెంతమంది చనిపోవాలి ? అవిటివారు, దీర్ఘరోగులు, అన్నాహారాలకి అలమటించే అనాధలు - అభాగ్య జీవులు ఎందరో - ఎందరెందరో ధైర్యంగా బ్రతుకులు కొనసాగిస్తూ వుంటే - మీరు...కేవలం..."

"నందా ! ఇవన్నీ నేను ఆలోచించలే దనుకున్నావా ? ఆలోచించి ఆలోచించి నా బుర్ర బ్రద్ధలయింది. ఇంతకన్న మార్గం నాకు కన్పించలేదు..." భార్య పరిష్వంగంలో సేదతీరిన మన్మధ కొద్ది కొద్దిగా మామూలు స్థితికి వస్తున్నాడు.

"నిజంగా మీకు ఈ వుద్యోగం చెయ్యడం యిష్టం లేకుంటే, ఈ ఉద్యోగమే కాదు - ఈ ఊర్నే వదలి అజ్ఞాతంగా ఎక్కడయినా బ్రతుకుదాం. కాళ్ళుచేతులు ఇచ్చాడు భగవంతుడు. కొద్దో-గొప్పో చదువుకున్నవాళ్ళమే ఇద్దరం. ఎలాగో బ్రతక్కపోము."

"అవన్నీ నువ్వనుకున్నంత సులభం కాదు నందా...!"

"అంటే అన్నిటికన్న సులభం చంపడం - చనిపోపడం అన్నమాట.."

"నందా!" బాధగా చూశాడు మన్మధ.

"చూశారా! 'చంపడం' - ఈ మాటంటేనే మీ కెంత బాధగా వుందో! మీరు మామూలు మనిషయ్యాక, మీ మనస్సు మీ స్వాధీనంలోకి వచ్చాక చీమను కూడా చంపలేరండీ! ఆ క్షణం ఆ ఘోరనిశ్చయానికి మిమ్మల్ని వుసి కొల్పిన ఆ భయంకర క్షణం దాటి పోయిందండీ! ఏ భర్త తలని మరింత గట్టిగా హృదయానికి హత్తుకుంది ఆనంద.